## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్రోణాదుల గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. ద్రోణాదుల గ్రామ 10వ వార్డు పంచాయతీ సభ్యుడు పెంటాల వెంకటేశ్వరరావు మార్టూరు నుంచి సర్వీసు రోడ్డులో జొన్నతాళి వైపు బైకుపై వెళుతున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న ఒక ఆటో డ్రైవర్ వెంకటేశ్వరరావు వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కుడికాలు రెండు చోట్ల విరిగి తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### వరిగడ్డి వామి దగ్ధం


వరిగడ్డిని ట్రాక్టర్‌పై నుంచి తీస్తున్న జేసీబీ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలో శుక్రవారం ట్రాక్టర్‌పై ఉన్న వరి గడ్డి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామం నుంచి వరిగడ్డి లోడుతో ట్రాక్టర్ బయలుదేరింది. వరి గడ్డిని తూర్పుకొప్పెరపాడు గ్రామం రైతు కొనుగోలు చేయగా లోడుతో గ్రామానికి బయలు దేరింది. పంగులూరు నుంచి తూర్పుకొప్పెరపాడు గ్రామం వైపు బయలుదేరగా పంగులూరు గ్రామంలోని వాటర్ ట్యాంకర్ వద్ద ట్రక్కుపై ఉన్న వరి గడ్డికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ ట్రాలీ నుంచి ట్రాక్టర్‌ను వేరు చేసి, జేసీబీ సాయంతో ట్రాక్‌లో ఉన్న వరి గడ్డిని కిందకు తీయించారు. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. వరిగడ్డి ట్రాక్టర్‌కు మంటలు వ్యాపించడంపై కారణాలు తెలిసి రాలేదు.

### రైతుల ప్రయోజనం కోసమే మార్కెట్ యార్డులు


స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు సభ్యులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మార్కెట్ యార్డును శుక్రవారం అద్దంకి మార్కెట్ యార్డ్ చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శనగ రైతులు వారు పండించిన పంటను ఆరబెట్టుకునేందుకు మార్కెట్ యార్డు అనువుగా ఉంటుందన్నారు. త్వర్యంలో మార్కెఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. శనగ రైతులు ఎక్కడ నష్టపోకుండా ప్రభుత్వం వారికి మద్దతు ధర ఇచ్చి శనగలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఇప్పటికే మార్కెట్ యార్డులు శనగలు ఆరబెట్టుకునేందుకు అనుమతి అడిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, యార్డు అసిస్టెంట్ శివ కుమార్ రైతులు పాల్గొన్నారు.

### రేపు సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ కబడ్డీ బాలబాలికల జట్టు ఎంపిక 18వ తేదీ ఆదివారం చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల బరువు 55 కిలోలలోపు ఉండాలని, 2008 మార్చి19 తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఎంపిక కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకొని రావాలని ఆయన సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హాజరు కావాల్సిందిగా ఆయన తెలిపారు. వివరాలకు 63010 15775, 99669 86373 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు నాగరాజు

యద్దనపూడి: మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా యద్దనపూడి ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌ను తహశీల్దారు వై. నాగరాజు పరిశీలించారు. ఎన్నికల కమిషనర్ సూచనలకు అనుగుణంగా అన్ని పోలింగ్‌స్టేషన్ సౌకర్యాలను ఎన్నికల నిర్వహణకు ఏఏ సౌకర్యాలు అవసరమో అన్న విషయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్‌స్టేషన్ వద్ద దివ్యాంగులకు అవసరమైన ర్యాంపు సౌకర్యం, విద్యుత్, పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన వసతుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, హెచ్ఎం రావి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

# పూర్తి సంతృప్తిగా సీఎం జగన్ పాలన


చిన హనిమిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీ సింధూర


వృద్ధురాలితో మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- ప్రజలు ఆనందంగా ఉన్నారు
- 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమంలో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారు.. ఏ గ్రామానికి వెళ్లిన లబ్ధిదారులు తాము ఆనందంగా ఉన్నామని చెప్పుండటమే ఇందుకు నిదర్శనం అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో శుక్రవారం 'పల్లెపల్లెకు పానెం చిన హనిమిరెడ్డి' కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు చిన హనిమిరెడ్డిని బాణసంచా, తప్పెట్లు, డీజే సౌండ్లు మధ్య గ్రామం అంత ఊరేగించారు. గ్రామంలో ఉన్న అంబేడ్కర్ చిత్రపటాకి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. సంక్షేమ పథకాలతో తాము పొందిన ప్రయోజనాలను ప్రజలే వివరిస్తున్నారు. ప్రభుత్వం తమకు మంచి చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

**నిన్నటి వరకు బద్ధ శత్రువులు.. నేడు మిత్రులయ్యారు..**

నిన్నటి వరకు ఒకరిపైమరొకరు దూషించుకున్న నాయకులు నేడు ఒక్కటయ్యారు.. కేవలం కుట్రలు, కుతంత్రాలు చేయడానికే మీ ముందుకు వస్తున్నారని హనిమిరెడ్డి విమర్శించారు. ఓటర్లు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో 175 స్థానాల్లో మొదటి గెలిచేది అద్దంకి నుంచి వైఎస్సార్ సీపీ తరుపున నేనే అని అన్నారు. నేడు ఇద్దరు కలిసి ఎన్నో దొంగ హామీలు ఇస్తారుని అవి నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, అద్దంకి మార్కెట్ యార్డు చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, కొప్పెరపాడు ఎంపీటీసీ సభ్యులు నూకతోటి సింధూర అజిల్, గ్రామ సొసైటీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరావు, ఉపసర్పంచ్ నూకతోటి ఝాన్సీరాణి, గ్రామ నాయకులు కోయి కాజ, కొడవళ్ల హరిబాబు, చలిచం ఆంజనేయులు, మల్లె ప్రసాద్, బొడ్డు రాజేష్, కుంచాల రమణయ్య, చేతరాజుపల్లి సుబ్బారావు, ఎనికపాటి శ్రీనివాసరావు, ఆముదాల సామ్రాట్, బొప్పుడి కుమార్, నీలం శ్రీకాంత్, మండల బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు స్వయంపు సురేష్, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు తలచుకుంటే విజయం తథ్యం


మాట్లాడుతున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

- సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: మహిళలు తలచుకుంటే విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం వీఓఏలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఎన్నో సమక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారు ఆర్థికంగా ఎదిగే విధంగా చేయూత ఇచ్చిందన్నారు. మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వమేదైనా ఉంటే అది వైఎస్సార్ సీపీనే అని చెప్పారు. పథకాల్లో ఎక్కువ పథకాలను మహిళలకే అందించే విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంత మంచి చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి డ్వాక్రా మహిళ పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మళ్లీ మళ్లీ ఆయనను సీఎం చేసుకుంటే ఇంతకంటే ఎన్నో సంక్షేమ పథకాలను మీకు అందిస్తాడని వివరించారు. గ్రామాల్లోని మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలు, స్థానిక నేతలు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# 308 మందికి వైద్య పరీక్షలు


పూసపాడులో వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇంకొల్లు గ్రామ సచివాలయం-4 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో మొత్తం 308 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 46 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 262 మంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నరసింహరావు, వైష్ణవి, సాంబశివయ్య, కంటి వైద్యులు డాక్టర్ సుధాకర్‌లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఈఓ కోటి నాగయ్య, గ్రామ కార్యదర్శి టీ సుబ్బారావు, ఏఎన్ఎం సుభాషిణి, సీహెచ్ఓ మస్తానమ్మ, 104 డీఈవో గోపికృష్ణ, వినీత్, పైలెట్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- ఇంకొల్లు మండలంలోని పూసపాడు గ్రామ సచివాలయ పరిధిలో 406 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ పోలూరి రమాదేవి, కార్యదర్శి వేమవరపు సురేష్ బాబు, ఏఎన్ఎం ఆదెమ్మ,సీహెచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ర్యాలీ


నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

పర్చూరు (చినగంజాం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని కోరుతూ పరూలో సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త కార్మిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా వ్యతిరేక చట్టాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు బండారు చిన్నదాసు, కే శ్రీనివాసరావు, మత్తె డేవిడ్, కే బాబు తదితరులు పాల్గొన్నారు.

# మార్టూరు, వలపర్లలో ఆమంచి పర్యటన


వలపర్లలో డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న ఆమంచి

మార్టూరు: పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం మండలంలోని వలపర్ల, మార్టూరులో పర్యటించారు. మధ్యాహ్నం వలపర్లలో నూతనంగా నిర్మాణాలు పూర్తయిన డ్రైనేజీ కాలువలను పరిశీలించి వీధుల వెంట తిరిగి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మార్టూరు, వలపర్ల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు


రామన్నపేట పంచవటి క్షేత్రంలో పూజలు చేస్తున్న సమన్వయకర్త వెంకటేష్


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న పాండురంగస్వామి


వేటపాలెం సూర్యనారాయణ దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ

- ప్రత్యేక పూజలు, హోమాల నిర్వహణ
- భక్తులతో కిటకిటలాడిన పలు ఆలయాలు

చీరాల టౌన్/వేటపాలెం: సూర్య భగవానుడి జయంతి, రథసప్తమి సందర్భంగా శుక్రవారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అదితి, కశ్యపులకు సూర్యుడు జన్మించిన రోజుది. మండలంలోని పాత చీరాల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రథసప్తమి వేడుకల్లో భాగంగా శుక్రవారం సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను పండితుల మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. సూర్యభగవానుని ప్రత్యేకమైన పూలతో సుందరంగా అలంకరించి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన సూర్యభగవానుని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు మహా సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు అన్ని సదుపాయాలను దేవస్థాన అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయగా ఒన్‌టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

■ రామన్నపేట పార్వతీపురంలో గల పంచవటి రామలింగేశ్వర స్వామి శివశక్తిపీఠ క్షేత్రం పదో వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. క్షేత్రాన్ని వైఎస్సార్ సీపీ చీరాల నియోజవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టా అనంత లక్ష్మి, బటట లీలా ప్రసాద్, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, పృథ్వీ చంద్రమోహన్, దంతం హనుమంతరావు, బండి కళ్ల నరేష్, లేళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

■ దేశాయిపేట శివారులోని బ్రహ్మోస్ ఫ్యాక్టరీ సమీపంలో గల సూర్యనాయణ స్వామి దేవస్థానంలో రథసప్తమిని పుర్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అఖండ దీపారాధనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. శ్రీదేవి భూదేవిసమేత చెన్నకేశస్వామి దేవస్థానంలో రథసప్తమిని పురస్కరించుకొని స్వామివారికి గ్రామంలో గ్రామమోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

యద్దనపూడి: సకల జగత్తుకు వెలుగునిచ్చే సూర్యభగవానుడి పుట్టిన తిథి అయిన మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. చింతపల్లిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, తోమాలసేవ, విశ్వక్సేనపూజ, వికసన పుణ్యాహవచనంతో మూలవరులకు శాస్త్రోకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆదిత్యాహనం నిర్వహించి సూర్యారాధన వల్ల కలుగు ప్రయోజనాలను భక్తులకు వివరించారు.

చీరాల అర్బన్: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వీరరాఘవస్వామి దేవాలయం, పేరాల మదనగోపాలస్వామి దేవాలయం, సంతబజారులోని ఉడయవర్లు దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉడయవర్లు దేవస్థానంలో ఏడు వాహనాలపై స్వామివార్లను ఉంచి ఊరేగించారు. తిరుమలలో జరిగే విధంగా చీరాలలోనూ ఏడు వాహనాలపై నగరోత్సవాన్ని నిర్వహించారు.

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం ఎసీ సుభద్ర ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సూర్యనారాయణ దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

బల్లికురవ: మాఘమాసంలో శుక్లపక్ష సప్తమి సందర్భంగా సూర్యభగవానుడిని ఆరాధిస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని కొణిదెన, చెన్నుపల్లి, ఆలయాల అర్చకులు, ఐవీ శోభనాచార్యులు, మోహనశర్మ, పీ. సుబ్రమణ్యశర్మ తెలిపారు.


చీరాల: ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు


శింగరకొండలో సూర్యనారాయణ భగవానుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


యద్దనపూడి: ఆదిత్య హోమం నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు


రావూరిపేటలో స్వామిని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

### గ్రామీణ వైద్యంపై అప్రమత్తంగా ఉండాలి

కారంచేడు: గ్రామాల్లో పేద ప్రజలకు అందించే ప్రభుత్వ ఉచిత వైద్యంపై ప్రజలతో పాటు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ఎంపీడీఓ బీ బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బందితో మాట్లాడారు. మండలంలోని స్వర్ణ, దగ్గుబాడు, కారంచేడు పీహెచ్‌సీలలోని ఏఎన్ఎంలు, ఆశలు ఫీల్డులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించే వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచిందన్నారు. ఈవిషయాలన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వార వైద్య సేవల్లో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీలో మండలం కేవలం 85 శాతం మాత్రమే ఉందని దీనిని నూరు శాతం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యనిర్వహణాధికారి పీ లక్ష్మీనారాయణ, మూడు పీహెచ్‌సీల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

కారంచేడు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించే వ్యక్తులపై చర్యలు తప్పవని కారంచేడు ఎస్ఐ కే సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి మండలంలోని దగ్గుబాడు గ్రామంలో కేక్ కటింగ్‌ల వ్యవహారంలో పోలీసు సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి, వారి విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. వీరిలో ఏ-2గా ఉన్న జీ రాజేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. కోర్టు వారు నిందితునికి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

### క్రీడాకారుడికి హనిమిరెడ్డి అభినందనలు

అద్దంకి రూరల్: ఈనెల 17, 18 తేదీల్లో కేరళ రాష్ట్రంలో జరిగే అండర్-19 సౌత్‌జోన్‌కు ఎంపికైన సంతమాగులూరు మండలం వెల్లల చెరువు గ్రామానికి చెందిన గంటినపాటి వెంకటేష్‌ను శుక్రవారం అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### కులగణను నూరుశాతం పూర్తిచేయాలి

బల్లికురవ: ప్రభుత్వం చేపట్టిన కులగణను గ్రామ సచివాలయాల వారీగా తక్షణమే నూరు శాతం పూర్తిచేయాలని ఎంపీడీవో హనమారెడ్డి కోరారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కులగణనపై 20 సచివాయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 90 శాతం పూర్తయిందని, గ్రామాల వారీగా వలంటీర్ల సహకారంతో పూర్తి చేయాలని, ఈబీసీ నేస్తం మూడోవిత సొమ్మును ఈనెల 24వతేదీ సీఎం విడుదల చేస్తారన్నారు. అర్హులందరిచేత దరఖాస్తు చేయించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ దాసరి సుమతి పాల్గొన్నారు.

### స్వామీజీ కార్యక్రమానికి రావాలని ఆహ్వానం

అద్దంకి: మైసూరు దత్తపీఠ ఉత్తరాధిపతి అద్దంకి వస్తున్న నేపథ్యంలో కార్యక్రమానికి రావాలని దత్త దేవస్థానం తరుపున దేవస్థాన అధ్యక్షుడు నాగసూరి ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కే రామకోటేశ్వరావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, వార్డు ఇన్‌చార్జి ఊడత్తు సురేశ్, కోట శ్రీనివాసకుమార్, తదితర ఆర్యవైశ్య ప్రముఖులు శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు.

### ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు


కేక్ కట్‌చేస్తున్న మహేష్‌రెడ్డి, వలంటీర్లు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు అని సంతమాగులూరు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కైపు మహేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో మండల వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు కరోనా కష్టకాలంలో ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సేవలకు గుర్తించి వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రలుగా ప్రశంస పత్రాలతోపాటు నగదు పురస్కారాన్ని అందజేస్తున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు వలంటీర్లు పాల్గొన్నారు.

### వ్యర్థాలతో పంచాయతీలకు లాభాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

అద్దంకి: వ్యర్థాలను సమాజానికి ఉపయోగపడే పదార్థాలుగా మారుద్దామని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సెర్ప్ ఎన్జీవో ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వాటిని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లులకు తరలిస్తే వాటిలో తడి వ్యర్థాలను ఉపయోగపడే ఎరువులుగానూ, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌తో లాభదాయకమైన వనరులుగా మారుస్తారని చెప్పారు. దాంతో పంచాయతీకు అదనపు నిధులు సమకూరుతాయని చెప్పారు. వ్యర్థాల నిర్వహణపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హాజరయ్యారు.